క్లుప్తంగా

టీఎమ్మార్పీఎస్‌తో సంబంధం లేదు



మాట్లాడుతున్న తప్పెట్ల శ్రీరాములు

భానుపురి : నూతనంగా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు చెబుతున్న కత్తి ఉపేందర్‌కు టీఎమ్మార్పీఎస్‌తో ఎలాంటి సంబంధం లేదని టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తప్పెట్ల శ్రీరాములు మాదిగ అన్నారు. శనివారం పట్టణంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్టల శ్రవణ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన టీఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లాస్థాయి విస్తృత సమావేశంలో మాట్లాడారు. అనంతరం నూతన పట్టణకమిటీని ఎన్నుకున్నారు. పట్టణ ప్రధాన కార్యదర్శిగా పంతం సతీష్, యూత్ అధ్యక్షులుగా వల్దాసు అవినాష్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు నకిరేకంటి సైదులు, బొడ్డు సైదాక్క, మీసాల శివరాంకృష్ణ, పిడమర్తి మధు, బొల్లె అశోక్, సూరారపు నాగయ్య, యడవెల్లి రాము, కొండేటి సందీప్, మీసాల గోపి తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు వీడ్కోలు సమావేశం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

నూతనకల్ : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే లక్ష్య సాధనకు కృషి చేయాలని పాఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకట్‌గౌడ్ అన్నారు. నాగార్జున ఒలింపియాడ్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శనివారం మండల కేంద్రంలోని ఐఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం మారగాని విజయలక్ష్మి గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీష్‌రావు వైఖరిని ఖండిస్తున్నాం

సూర్యాపేటటౌన్ : ఉద్యోగుల వేతనాల పట్ల మాజీ మంత్రి హరీష్‌రావు వైఖరిని ఖండిస్తున్నామని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్, చింతారెడ్డి రామలింగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల పనితీరు, హక్కులను కాలరాసే విధంగా అవమానపరుస్తూ.. జీతాల గురించి ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు.

ఆలయంలో అన్నదానం

మునగాల : మండల కేంద్రంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 46వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్నదానాన్ని పీఏసీఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో ముత్యాల సత్యనారాయణ, ఇనుగుర్తి వీరాచారి, ముత్యాల కృష్ణమాచారి పాల్గొన్నారు.

అన్నదాతకు సాగునీటి గోస

- వారబందీ విధానంలో చివరి భూములకు చేరని గోదావరి జలాలు
- జీటలు వారుతున్న భూములు.. ఎండుతున్న పంటలు
- ఎస్సారెస్పీ నీటిని సరిపోను అందించాలని రైతుల వేడుకోలు



రామన్నగూడెంలో నెర్రెలుబారిన వరిపొలం



71 డీబీఎం కాలువకు నిలిచిన నీళ్లు

అర్వపల్లి : సాగునీరందక వరి పంటలు ఎండిపోతున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎస్సారెస్పీ నీళ్లు వారబందీ విధానంలో రావాల్సి ఉండగా సరిగా రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు ప్రతిసారి మాదిరిగానే ఈ యాసంగి సీజన్‌లో కూడా ఎస్సారెస్పీ రెండో దశ కింద వరి పంటలు సాగుచేసుకున్నారు. అయితే ప్రాజెక్టులో నీటి లభ్యత తక్కువగా ఉండటంతో ఈ సీజన్‌లో తక్కువ నీటిని వదులుతున్నారు. వారబందీ విధానం అయినప్పటికీ గతంలో పంటలు చేతికి వచ్చే వరకు నీటిని వదిలారు. అయితే ఈసీజన్‌లో నీళ్లు వారబందీ విధానంలో తక్కువగా వదలడం, ఇవి కూడా సక్రమంగా రాకపోవడం మూలంగా రైతులు ఆందోళన చెందుతున్నారు.

22వేల ఎకరాల్లో సాగు..

యాసంగి సీజన్‌కు గాను జాజిరెడ్డిగూడెం మండలంలో రైతులు 22 వేల ఎకరాల్లో వరిపంటలు సాగుచేశారు. అయితే ఈసీజన్‌కు సంబంధించి జనవరి 8 నుంచి 17వ తేదీ వరకు మొదటి విడతలో నీళ్లు వదిలారు. అయితే వారబందీ విధానంలో నీటిని ఇస్తున్నప్పటికీ తక్కువగా వదులుతుండటంతో నీళ్లు కాలువల నుంచి తూములకు ఎక్కని పరిస్థితి ఏర్పడింది. దీంతో పంటలకు నీళ్లు అందడంలేదు. కాగా ఐదో విడతలో ఈనెల 8న నీటిని పునరుద్ధరించాల్సి ఉంది. కానీ రెండు రోజులు గడుస్తున్నా ఇంతవరకు నీటి పునరుద్ధరణ జరుగలేదు.

ఎల్‌ఎండీ నుంచి మైలారం రిజర్వాయర్‌ద్వారా బయ్యన్నవాగు మీదుగా గోదావరి జలాలు ఈ ప్రాంతానికి రావాల్సి ఉంది. అయితే పై ప్రాంతంలో రైతులు ఎక్కడికక్కడ గ్రామాల్లో తూములు, గేట్లు తెరచడంతో కిందికి నీళ్లు రావడంలేదు. తక్కువగా నీళ్లు వస్తుండటంతో కాలువల అడుగు భాగంలోనే ఇంకిపోయే పరిస్థితి నెలకొంది. ఎండలు తీవ్రం కావడంతో పంటలకు నీటి అవసరం పెరిగింది. ప్రస్తుతం నీళ్లు రాక వరిపొలాలు నెర్రెలు బారి ఎండిపోతున్నాయి. మరో నెల పదిహేను రోజుల పాటు గోదావరి జలాలను వదలాలని, నీటి విడుదలను పెంచాలని రైతులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

10 ఎకరాల వరి పొలం ఎండిపోతోంది



రామన్నగూడెం శివారులో ఈ సీజన్ నందు 10 ఎకరాల భూమి కౌలుకు తీసుకొని వరిపంట సాగుచేశాను. పూర్తిగా గోదావరి జలాలపై ఆధారపడి పంట వేశాను. ఈ నీళ్లు సరిగా రాక పంట ఎండిపోతుంది. వెంటనే అధికారులు గోదావరి జలాలను పునరుద్ధరించి వరి పొలాలను కాపాడాలి. లేకుంటే తీవ్రంగా నష్టపోతాం.

– బైరబోయిన రామలింగయ్య, రైతు, అర్వపల్లి

నీళ్ల కోసం ఎదురుచూస్తున్నాం



గత కొన్నేళ్ల నుంచి గోదావరి జలాలపై ఆధారపడి వరి పంట సాగుచేస్తున్నాను. అయితే ఇప్పటి వరకు కూడా పంటలకు సరిపోను నీళ్లు వదిలారు. ఈ యాసంగి సీజన్‌లో మాత్రం మొదటి నుంచి గోదావరి నీళ్లు పంటలకు సరిపోను రావటం లేదు. వారబందీ విధానంలో ప్రస్తుతం రావాల్సి ఉండగా రెండు రోజుల నుంచి వదలలేదు.

– సుంకరి వెంకన్న, రైతు, సీతారాంపురం

నీటి లభ్యత తక్కువగా ఉండడంతోనే..



ఈసారి ప్రాజెక్టులో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున పంటలకు సరిపోను నీళ్లు ఇవ్వడం ఇబ్బందిగా మారింది. అందుచేతనే సీజన్‌కు ముందే ఆరుతడి పంటలు సాగుచేసుకోవాలని, చివరి భూములకు నీళ్లు అందడం సాధ్యం కాదని నీటి పారుదలశాఖ ప్రకటించింది. ప్రాజెక్టులో నీటి లభ్యత ఉన్న మేరకు రెండో దశకు నీటిని వదులుతున్నాం. ఒకటి రెండు రోజుల్లో గోదావరి జలాల పునరుద్ధరణ జరుగుతుంది.

– ఎం.సత్యనారాయణ, బయ్యన్నవాగు డీఈఈ

బీమాతో ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత



అడివెంలలో రూ.7లక్షల బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేలు

అర్వపల్లి : బీమాతో ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత ఏర్పడుతుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండల పరిధిలోని అడివెంల గ్రామానికి చెందిన మంగ రవి ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. దీంతో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి రూ. 7.14 లక్షల చెక్కు మంజూరైంది. ఆ చెక్కును కంపెనీ వారు శనివారం గ్రామంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా మృతుడి భార్య శైలజకు ఇప్పించారు. అలాగే శైలజకు 13 ఏళ్ల పాటు శ్రీరామ్ కంపెనీ నుంచి ప్రతి నెలా రూ. 3వేల చొప్పున పింఛను రానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం అట్ల సురేష్, డీఎం చిరంజీవి, బీఎం భరత్‌కుమార్, నరేష్‌గౌడ్, భరత్, ఉప్పలయ్య, డీఓలు కృష్ణారావు, నాగేశ్వర్‌రావు, మంజుల, రాజు, ఏజెంట్లు మధుసూదన్, సుధాకర్, నరేష్, సురేందర్, కృష్ణ, రఘు, జాన్, నాయకులు, కంపెనీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన జిన్న భాగ్యమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో గ్రామ 1వవార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కందుకూరి మహేష్ ఆధ్వర్యంలో శనివారం మృతురాలి కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి కుమారుడు ప్రవీణ్‌రెడ్డికి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కందుకూరి గణేష్, బింగి మహేష్, సంపత్, రవి, కృష్ణంరాజు, కె.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఎండిన పంటలకు నష్టపరిహారం ప్రకటించాలి

మునగాల : మునగాల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు కోరారు. శనివారం మండల కేంద్రంలోని సుందరయ్య స్మారక భవనంలో మండల కమిటీ సభ్యుడు షేక్ సైదా అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో యాసంగి సీజన్‌లో పంటపొలాలు పూర్తిగా ఎండిపోవడంతో రైతులకు నష్టాలే మిగిలాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఎండిపోయిన వరి పొలాలకు ఎకరాకు రూ.20వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన సేవా కేంద్రాల్లో గృహజ్యోతికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గ్రామ పంచాయతీలలో కార్యదర్శుల ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చందా చంద్రయ్య, మండల కమిటీ సభ్యులు బచ్చలకూరి స్వరాజ్యం, వీరబోయిన వెంకన్న, డి.స్టాలిన్ రెడ్డి, జ్యోతి, వెంకటాద్రి, బోళ్ల కృష్ణారెడ్డి, బోనాల మంగయ్య, ఆరె.రామకృష్ణారెడ్డి, అనంతు గుర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

రవన్న స్ఫూర్తితో ఉద్యమాలను ఉధృతం చేస్తాం



దురాజ్‌పల్లి : నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు



నూతనకల్ : రవన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

దురాజ్‌పల్లి : భారత విప్లవోద్యమ నాయకుడు, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యుడు రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న)ను స్ఫూర్తిగా తీసుకొని పోరాటాలను ఉధృతం చేస్తామని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కమిటీ సభ్యుడు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక పిలుపునిచ్చారు. శనివారం రవన్న 8వ వర్ధంతి సందర్భంగా కుడకుడ శివారు లెనిన్‌నగర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్రఅఖిల్ కుమార్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు చంద్రకళ, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరబోయిన రమేష్, కోశాధికారి వాజీద్, పార్టీ డివిజన్ నాయకుడు సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.

రవన్న ఆశయాలకు పోరాడుదాం..

రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) ఎనిమిదో వర్ధంతి సందర్భంగా న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, జిల్లా కమిటీ సభ్యులు సామా నర్సిరెడ్డి, బండి రవి, పెద్దింటి అశోక రెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు పిడమర్తి భరత్, బొడ్డు ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రవన్న ఆశయ సాధనకు కృషి చేయాలి

నూతనకల్ : సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యుడు రవన్న (సుభాష్ చంద్రబోస్) ఆశయ సాధనకు కృషి చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేసోజు మధు కోరారు. శనివారం మండల కేంద్రంలోని గునగంటి సత్యనారాయణగౌడ్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రవన్న 8వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రవన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు మున్నా నాగరాజు, ఉప్పుల సందీప్, చింటు, వేల్పుల భరత్, కూసు నాగరాజు, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

- మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి



సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తదితరులు

సూర్యాపేట : వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో నిర్మాణ పనులు చేపట్టనున్న సూపర్ స్పెషాలిటీ, టీచింగ్ ఆస్పత్రి స్థలాన్ని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేలు, మాజీ మంత్రి రామిరెడ్డి దామోదర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తోందని, విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో వైద్యుల కొరత లేకుండా చూస్తున్నట్లు తెలిపారు. అలాగే మౌలిక వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. సర్వే నంబర్ 765, 766లో గల 5 ఎకరాల 8.5 గుంటల స్థలంలో రూ.190.50 కోట్లతో చేపట్టే సూపర్ స్పెషలిటీ ఆస్పత్రి, టీచింగ్ ఆస్పత్రి పనులను సత్వరమే చేపట్టాలని డీజేపీఆర్ కన్‌స్ట్రక్షన్ వారిని, అలాగే సంబంధిత ఇంజనీర్లను ఆదేశించారు. పక్కనే ఉన్న పాత పాలిటెక్నిక్ కళాశాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ మురళీధర్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి కోటా చలం, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీవీ శారద, ఈఈ అజీజ్, తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, నాయకులు చెవిటి వెంకన్నయాదవ్, కొప్పుల వేణారెడ్డి, పోతు భాస్కర్, అంజద్‌అలీ, చెంచల శ్రీను, నాగుల వాసు, శభరి పాల్గొన్నారు.

గ్యాస్‌ధర తగ్గింపుపై హర్షం

కోదాడ : మహిళా దినోత్సవం సందర్భంగా వంట గ్యాస్ ధరను వంద రూపాయలు తగ్గించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శనివారం కోదాడలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు నూనె సులోచన మాట్లాడారు. కేంద్రప్రభుత్వ నిర్ణయంతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు.

మహిళల చదువుతో సమాజంలో మార్పు



సమావేశంలో మాట్లాడుతున్న పూలన్



ఆత్మకూరులో ఆటల పోటీలో పాల్గొన్న మహిళలు



తుంగతుర్తిలోని గిరిజన గురుకులంలో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరు (ఎస్) : మహిళల చదువుతో సమాజంలో మార్పు సాధ్యమని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పూలన్ అన్నారు. శనివారం పాత సూర్యాపేట గ్రామంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలపై కొనసాగుతున్న శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా మెరుగైన పరిస్థితుల కోసం మరిన్ని చట్టాలు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నర్సమ్మ, సైదమ్మ, టీపీటీఎఫ్ నాయకులు సుభాను, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, నాయకులు సామ నర్సిరెడ్డి, ఉపేందర్, రేణుక, శైలజ, మమత, పున్నమ్మ, లక్ష్మమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల నిర్వహణ..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళలందరికీ శనివారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ వత్సవాయి లలిత, అంగన్వాడీ టీచర్ పద్మ, అనిత, నాగలక్ష్మి, మంజుల, సునంద, అన్నపూర్ణ, శిరీష, గాయత్రి, నిర్మల, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

తుంగతుర్తి : మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ప్రిన్సిపల్ నీలారాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాలలో కేక్ కట్ చేశారు. మహిళా ఉపాధ్యాయులను, సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, రవి, జోగ్యా, ధర్మా, మహిళా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవం



పిల్లలమర్రిలో శివపార్వతుల కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తులు



తుంగతుర్తి : కొత్తగూడెంలో నందిపై పరమశివుడి ఊరేగింపు



ఆత్మకూరులో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

సూర్యాపేట రూరల్ : యండ్లపల్లి గ్రామంలోని శ్రీ పార్వతీ సమేత స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో లింగాయత్ బలిజ పూజారుల ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి రుద్రాభిషేకాలతో పాటు, పార్వతీ పరమేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. అనంతరం నంది వాహనంపై పార్వతీ పరమేశ్వరుల ఊరేగింపు నిర్వహించారు. శనివారం గ్రామంలోని శివస్వాములు గ్రామ పెద్దల సమక్షంలో అగ్నిగుండాల మహోత్సవం నిర్వహించారు. అనంతరం లింగాయత్ లింగ బలిజల, ఈర ముష్టి వారి ఆధ్వర్యంలో గెలుపు కార్యక్రమం, ప్రభలు నెలవారాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు శ్రీ కంఠమహేశ్వర యూత్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యండ్లపల్లి మాజీ సర్పంచ్ దండి సుగుణమ్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దండి రమేష్, ఎంపీటీసీ కుంట్ల సరిత అనంత్ రెడ్డి, మాజీ వార్డు మెంబర్లు, పూజారులు మూల వీరయ్య, రమేష్, మల్లికార్జున్, విఠలప్ప తదితరులు పాల్గొన్నారు

పిల్లలమర్రిలో శివపార్వతుల కల్యాణం..

పిల్లలమర్రిలో శివపార్వతుల కల్యాణాన్ని శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శనివారం తెల్లవరుజామున స్వామి వారి ఉత్సవ విగ్రహాలను మహాదేవ నామేశ్వరాలయం నుంచి ఎరకేశ్వరాలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఎదుర్కోలు మహోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి వార్లను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. వేడుకల్లో అర్చకులు పులి హరి ప్రసాద్ శర్మ, మునగలేటి సంతోష్ శర్మ, దేవాలయ కమిటీ చైర్మన్ కోట్ల సైదులు, డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలు

పెన్‌పహాడ్ : నాగులపహాడ్ గ్రామంలోని శ్రీ త్రికుటేశ్వర ఆలయంలో మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. వేలాది భక్తులు కల్యాణాన్ని తిలకించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్, కోలాటం, కబడ్డీ పోటీలు కొనసాగుతున్నాయి. గుంటకండ్ల సావిత్రమ్మ జ్ఞాపకార్థం ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీపీ నెమ్మాది భిక్షం ప్రారంభించారు. విజేతలకు ఆదివారం బహుమతులు అందజేయనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సంకరమద్ది సుధీర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, దొంగరి యుగేందర్, మాజీ సర్పంచ్ లక్ష్మి, కొండా జానకిరాములు, నిరంజన్ రెడ్డి, శ్రవణ్‌రెడ్డి, సతీష్, రమేష్ పాల్గొన్నారు.

అర్వపల్లి : మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా జాజిరెడ్డిగూడెం, పర్సాయపల్లి, బొల్లంపల్లి, కొమ్మాల, అర్వపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాలతో పాటు తిమ్మాపురంలోని సూర్యక్షేత్రంలో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మాల శివాలయంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి అన్నదానం చేశారు. అలాగే మిగిలిన గ్రామాల్లో కూడా భక్తులకు నిర్వాహకులు శనివారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తిమ్మాపురం సూర్యక్షేత్రంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు జనార్దనస్వామి పాల్గొని కల్యాణోత్సవ కార్యక్రమాన్ని చేయించారు. ఆయా కార్యక్రమాల్లో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం రాత్రి కొత్తగూడెం గ్రామంలోని శ్రీ స్వయంభు శంభులిగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పరమశివుడిని నందిపై ఊరేగింపుగా తీసుకొచ్చి శివపార్వతుల కల్యాణం జరిపారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే తుంగతుర్తి, వెంపటి, వెలుగుపల్లి గ్రామాల్లో శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దొనకొండ రమేష్, పూజారులు మోహనశాస్త్రి, కాంతయ్యచారి, భక్తులు ఓర్సు వెంకన్న, నిరంజన్‌రెడ్డి, శ్రీకాంత్, సతీష్, గురుమూర్తి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : మహాశివరాత్రి సందర్భంగా మండల వ్యాప్తంగా శివపార్వతుల కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి దేవాలయం, ఏపూరు మల్లికార్జునస్వామి దేవాలయంతో పాటు అన్ని శివాలయాల్లో శుక్రవారం అర్ధరాత్రి కల్యాణతంతును నిర్వహించారు. శనివారం అన్నదానం ఏర్పాటు చేశారు.



సూర్యాపేట రూరల్ : యండ్లపల్లిలో శివపార్వతుల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



అర్వపల్లి : తిమ్మాపురం సూర్యక్షేత్రంలో శివపార్వతుల కల్యాణోత్సవం



సూర్యాపేట రూరల్ : అగ్నిగుండాల మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



అర్వపల్లి : కొమ్మాలలో శివపార్వతుల ఊరేగింపు

నిర్లక్ష్యంగా రహదారి నిర్మాణ పనులు

- తారురోడ్డుకు ఇరువైపులా మట్టిపోయకుండా వదిలేసిన కాంట్రాక్టర్
- జారిపడుతూ గాయాలపాలవుతున్న ద్విచక్రవాహనదారులు



ఆత్మకూరులోని దుబ్బగూడెంలో ప్రమాదకరంగా ఉన్న రహదారి

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. తారు రోడ్డు పోసినా దానికి ఇరువైపులా మట్టి పోయకపోవడంతో వాహనదారులు కిందపడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆత్మకూర్ (ఎస్) దుబ్బగూడెం నుంచి ఎక్స్‌రోడ్డు వరకు ఉన్న రహదారిని రెండువరసలుగా విస్తరించాల్సి ఉంది. పూర్తిగా దెబ్బతిన్న ఈ రోడ్డును అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని హడావుడిగా మరమ్మతులు చేపట్టారు. ఈ సమయంలో రహదారి ఎత్తు కాస్త పెరిగింది. అయితే ఈ నూతన రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి మట్టిని పోయకుండా అలాగే వదిలేశారు. దీంతో ఎత్తుగా ఉన్న తారురోడ్డు నుంచి ఎదురుగా వాహనాలు వస్తే కిందికి దిగిన వాహనదారులు మళ్లీ పైకి ఎక్కే సమయంలో కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు గాయాల పాలవుతున్నారు. మండల కేంద్రం కావడంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. రాత్రి సమయంలోనూ బైక్‌లు, ఆటోలలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనదారులు అధికంగా ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సంబంధిత కాంట్రాక్టర్‌తో పనులు చేయించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని మండల వాసులు కోరుకుంటున్నారు.